క్లుప్తంగా

సర్వశక్తిమయం శ్రీరామ నామం

సీటీఆర్‌ఐ: శ్రీరామ పదం కేవలం ఒక భౌతిక రూపాన్ని బోధించేది మాత్రమే కాదని, ఉపేయమైన భగవత్ప్రాప్తిని బోధించే పదమని, నారాయణాయ, నమశ్శివాయ అనే పంచాక్షరీ మహా మంత్రాలలోని రెండు వర్ణాలు రామనామంగా ఏర్పడ్డాయని నర్తనరుషి, నాట్యాచార్యులు, సప్ప దుర్గప్రసాద్ అన్నారు. ఆదివారం కళా గౌతమి ఆనందోద్యానవనంలోని కందుకూరి తెలుగు నాటక నిలయంలో ఏర్పాటు చేసిన రచయితల సమావేశంలో చెరుకుపల్లి గాంగేయ శాస్త్రి వ్రాసిన అయోధ్య రాముని నవగేయ మాలిక పాటల ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సభకు కళా గౌతమి అధ్యక్షుడు డాక్టర్ పీవీబీ సంజీవరావు అధ్యక్షత వహించారు. బొంత శ్రీహరి, డాక్టర్ తరపట్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అను ఇంటీరియర్స్, ఫర్నిషింగ్‌తో ఇంటికి సొయగాలు



పి.కుమార్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక తిలక్‌రోడ్డులోని అను ఇంటీరియర్స్ అండ్ ఫర్నిషింగ్స్ సంస్థ ద్వారా ఉభయ గోదావరి జిల్లాల ఖాతాదారులకు 20ఏళ్ల సేవలందిస్తున్నామని ఆ సంసథ నిర్వాహకులు పి.కుమార్ తెలిపారు. తమ వద్ద ఇంటికి సరికొత్త అందాలు అందించే ఫర్నిషింగ్స్, కర్టెన్లు, వాల్‌పేపర్లు, కార్పెట్లు, రిమోట్‌కర్టెన్లు, ఆర్టిఫిషియల్ టగ్రాస్, బ్లైండ్స్, 5డీవాల్ పేపర్లు, పీవీసీ ఫ్లోరింగ్ ఎక్స్‌టీరియర్ బ్లైండ్స్, వాటర్‌ప్రూఫ్ మ్యాట్లు, ఇంటీరియర్స్ అండ్ ఎక్స్‌టీరియర్స్, సోఫాప్యాబ్రిక్స్ వంటి అన్ని రకాల ఇంటీరియర్స్ తమ వద్ద అందుబాటు ధరల్లో లభిస్తాయని కుమార్ వివరించారు.

సంప్రదాయ పిండి వంటల వితరణ

సీటీఆర్‌ఐ: నిరాశ్రయులు, నిర్భాగ్యులు మధ్య సంక్రాంతి వేడుకలు చేసుకోవడం సంతృప్తి కలిగించిదని గాడాల శ్రీమహాలక్ష్మీ సమేత వేంకటేశ్వర స్వామి పీఠాధిపతి శ్రీమాన్ చిన్నవెంకన్న బాబు స్వామీజీ అన్నారు. సర్వేజన సుఖినోభవంతు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం రాజమహేంద్రవరంలోని పలుచోట్ల నిరాశ్రయులు, అనాధులు, చిన్న పిల్లలకు సంప్రదాయ పిండివంటలైన జంతికలు, అరిసెలు, సున్నుండులు వంటి పిండి వంటలను వితరణ చేశారు. ట్రుస్టు ఆధ్వర్యంలో 8 లక్షల మందికి అన్న వితరణ చేసినట్టు స్వామీజీ తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్ణిమ రాజ్, లావణ్య పాల్గొన్నారు.

జనసేన నేత కందుల దుర్గేష్‌కు పరామర్శ



ఉషారాణి పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న ఎంపీలు బోస్, భరత్ తదితరులు

సీటీఆర్‌ఐ(రాజమహేంద్రవరం): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జనసేన అధ్యక్షుడు కందుల దుర్గేషను రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఆదివారం పరామర్శించారు. దుర్గేష్ సతీమణి ఉషారాణి అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాదు ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 13న తుదిశ్వాస విడిచారు. ఆమె పార్థివ దేహాన్ని ఆదివారం రాజమండ్రి నగరంలోని జేఎన్ రోడ్డులోని కందుల నివాసం వద్ద ఎంపీ భరత్, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాస్ చంద్రబోస్, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నేతలు గుడూరి శ్రీనివాస్, నక్కా శ్రీనగేష్, ఎన్వీ శ్రీనివాస్ తదితరులు సందర్శించి ఘన నివాళులర్పించారు. ఆమె భౌతికకాయంపై పూలదండలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. కందుల దుర్గేష్‌కి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మంత్రి వేణు సంతాపం

రాజమహేంద్రవరం రూరల్: జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు కందుల దుర్గేష్ సతీమణి ఉషారాణి మృతిపట్ల జిల్లా ఇంఛార్జి మంత్రి, వైఎస్సార్‌సీపీ రూరల్ కోఆర్డినేటర్ చెల్లుబోయిన వేణుగోపాల్ కృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఉషారాణి ఆత్మకి శాంతి కలగాలని కోరుకుంటున్నా అని మంత్రి ఆ ప్రకటనలో తెలిపారు. దుర్గేష్ కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

ప్రతి ఇంటా సంక్రాంతి సందడి

- నగరంలో వీధివీధినా భోగి మంటలు
- ఆనందంగా పాల్గొన్న నేతలు
- ఆలయాల్లో పూజలు



భోగిమంటలలో పిడకలు వేస్తున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్ దంపతులు



ముగ్గులను పరిశీలిస్తున్న మంత్రి వేణు తదితరులు



భోగి సంబరాల్లో పాల్గొన్న ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్ పర్సన్ మేడపాటి షర్మిలరెడ్డి

సీటీఆర్‌ఐ: నగరంలో భోగి పండగను వీధి వీధిలో జరుపుకొన్నారు. ఆదివారం తెల్లవారు జామునుంచే భోగి మంటలు వెలిగించారు. ప్రజలు తమ ఇళ్లలోని పాత సామనులను తీసుకుని వచ్చి మంటల్లో వేశారు. చిన్నారులు, మహిళలు ఆవు పేడతో తయారు చేసిన పిడకలను మంటల్లో వేశారు. పెద్ద పండగ మొదటి రోజును నగరవాసులు ఆనందంగా జరుపుకొన్నారు. చిన్నారులపై భోగిపండ్లు పోసి, బొమ్మల కొలువులు ఏర్పాటు చేశారు. స్థానిక దానవాయిపేటలోని భోగి మంటలను రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి వెలిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందరికీ భోగభాగ్యలతో ఉండాలని కోరుకున్నారన్నారు. రాష్ట్రంలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని సీఎం జగనన్న మళ్లీ ముఖ్యమంత్రిగా కావాలని ఆమె ఆకాంక్షించారు.

అందరూ భోగ భాగ్యాలతో తులతూగాలి : ఎంపీ మార్గాని భరత్‌రామ్

రాజమహేంద్రవరం రూరల్: కొత్త ఏడాదిలో అందరూ భోగ భాగ్యాలతో తులతూగాలని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ తెలిపారు. ఆదివారం భోగి సందర్భంగా ఎంపీ నివాసం నేషనల్ హైవే ఓఎన్జీసీ కార్యాలయం పక్కన ఫ్లోరా అపార్ట్‌మెంట్ వద్ద సంప్రదాయబద్ధంగా భోగి మంటను వెలగించారు. ఎంపీ భరత్, ఆయన సతీమణి మోనా, ఇద్దరు కుమార్తెలు, తల్లిదండ్రులు, బంధువులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని భోగి మంటల వద్ద సందడి చేశారు. హరిదాసులు, పిట్టల దొర, సోదమ్మ తదితరులతో భోగి పండగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలంతా భోగ భాగ్యాలతో తులతూగాలని ఆకాంక్షించారు. పాపాలన్నీ భోగి మండల్లో దహించుకుపోయి భోగ భాగ్యాలు కలుగజేయాలని కోరుకున్నారు. అదే విధంగా ఈ నూతన సంవత్సరం 2024 ఎన్నికల సంవత్సరమని రాష్ట్రాభివృద్ధిని కాంక్షిస్తూ ప్రతి ఒక్కరూ సీఎం జగనన్నకు మద్దతు ఇవ్వాలని కోరారు.

ఆలయంలో సంక్రాంతి వేడుకలు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు గ్రామ దేవత దోసాలమ్మ అమ్మవారి ఆలయంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం భోగి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని 250 చీరలతో ప్రత్యేకంగా అలంకరించారు. ద్రాక్షారామానికి చెందిన అయ్యప్ప భజన బృందంచే భజన కార్యక్రమం నిర్వహించారు.

కడియం మండలంలో...

కడియం: పల్లెల్లో సంక్రాంతి సందడి నెలకొంది. ఎక్కడెక్కడి నుంచో తమ సొంత ఊళ్లకు చేరుకున్న వాళ్లో పల్లెలు కిటకిటలాడుతున్నాయి. భోగి పండగను ఘనంగా నిర్వహించారు. పలు చోట్ల రంగవల్లుల పోటీలు, సాంప్రదాయక క్రీడా పోటీలు నిర్వహించారు. కడియం పల్లెచెరువు గట్టుపై వరసిద్ధివినాయక ఆలయ కమిటీ, మనం ట్రస్టు ఆధ్వర్యంలో వివిధ క్రీడా పోటీలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మహిళలు, యువతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ కోఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాలకృష్ణ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆకట్టుకునేలా రంగవల్లులో తీర్చిదిద్దిన మహిళలను అభినందించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్రకార్యదర్శి గిరజాల వీర్రాజు, మండల పార్టీ అధ్యక్షులు యాదల సతీష్‌చంద్రస్టాలిన్, పార్టీ నాయకులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నయనానందం.. గోదాదేవి కల్యాణం



దుళ్లలో గోదా కల్యాణం నిర్వహిస్తున్న పండితులు



సీతంపేట రామాలయంలో గోదారంగనాథుల కల్యాణం

సీటీఆర్‌ఐ: గోదాదేవి ధనుర్మాసంలో నిర్వహించిన వ్రతం వల్లే శ్రీరంగనాథుడిని భర్తగా పొందింది. ఎంతో విశిష్టమైన ధనుర్మాసంలో నెల రోజుల పాటు భక్తిశ్రద్ధలతో స్వామివారిని కొలిచింది. ఆ విధంగా ఆయన అనుగ్రహం ఉంటుందని భక్తుల విశ్వాసం. ఈ సందర్భంగా నెల రోజుల పాటు వైష్ణవాలయాల్లో నిర్వహించిన ధనుర్మాస ఉత్సావాలు ఆదివారం గోదాదేవి కల్యాణంతో ముగిశాయి. రాజమహేంద్రవరం సిటీ, రూరల్‌లోని అన్ని వైష్ణావాలయాలో ఆదివారం సాయంత్రం గోదాదేవి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. అమ్మవారిని విశేషంగా అలంకరించి శ్రీరంగనాథుని వద్దకు తీసుకుని వెళ్లి కల్యాణం జరిపించడంతో భక్తులు పరవశులైయ్యారు. గోదావరి గట్టున ఉన్న శ్రీరంగధామంలో, క్షేత్రపాలకుడు వేణుగోపాల స్వామి ఆలయంలో, లాలాచెరువు వద్ద ఉన్న శ్రీగోవింద క్షేత్రంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. గోవింద క్షేత్రంలో అర్చకులు శ్రీమన్నారాయణ, రమేష్ పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు.

కడియం: దుళ్లలోని భూ సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయం వద్ద ఆదివారం ఉదయం గోదా కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పెద్దింటి లక్ష్మణాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు శాస్త్రోక్తంగా కల్యాణాన్ని జరిపించారు. మండల ప్రజలు భోగి పండగను ఘనంగా జరుపుకొన్నారు. తెల్లవారు జామునే తల స్నానాలు ముగించుకుని భోగి మంటలు వెలిగించారు. మండలంలోని ప్రముఖ ఆలయాలను దర్శించుకున్నారు.

రాజమహేంద్రవరం సిటీ: సీతంపేట పురాతన రామాలయంలో స్వామి వారికి విశేష దర్శనం కల్పించారు.

భోగిమంటతో ప్రారంభమైన వేడుకలు అనంతరం అలివేలుమంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామివారి ఉత్సవ విగ్రహాలకు భక్తులతో అభిషేకం నిర్వహించారు. విష్ణు సహస్రం, తిరుప్పావై పారాయణ చేశారు. సాయంత్రం గోదా రంగనాథ స్వామి వారికి కల్యాణం నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.



పాల్గొన్న భక్తులు



గోదారంగనాథుల కల్యాణం

సంస్కృతి సంప్రదాయాలే హిందూ జీవన విధానం



సంక్రాంతి సంబరాల్లో మాట్లాడుతున్న డాక్టర్ కర్రి రామారెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: సమాజంలలో మనం పాటించే నిబద్ధత, సంస్కృతి సంప్రదాయాలే హిందూ జీవన విధానమని ప్రముఖ మానసిక వైద్యనిపుణులు కర్రి రామారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో త్యాగరాయ నారాయణ దాస సేవా సమితి గానసభ ప్రాంగణంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డాక్టర్ కర్రి రామారెడ్డి మాట్లాడుతూ అయోధ్యలో జరిగే రామమందిరం నిర్మాణం హిందువుల స్వాభిమానానికి సంకేతమన్నారు. రాముని మందిర నిర్మాణం కేవలం మందిర నిర్మాణమే కాదు ప్రతి హిందువులో రాముని గుణగణాలు అలవర్చడమే ప్రధాన లక్ష్యమని మార్గదర్శనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎల్ రామారావు, కొంపెల్ల సుబ్బరాయ శాస్త్రి, బెజ్జవరపు రవి, బొమ్మల రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: రామదాసుపేట ప్రాంతంలో సారా విక్రయిస్తున్న పాటూర్నారి దుర్గాప్రసాద్‌ను ఆదివారం అరెస్టు చేసినట్టు ఎస్ఈబీ నార్త్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.వి.రమణ తెలిపారు. అతని నుంచి 40 లీటర్ల సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



హ్యాపీ స్ట్రీట్‌కు వేలాదిగా తరలివచ్చిన ప్రజలు



నృత్యాలతో సందడి చేస్తున్న యువత

రాజమహేంద్రవరం సిటీ: భోగి పండగ.. అందునా ఆదివారం కావడంతో నగరంలోని హ్యాపీ స్ట్రీట్ ప్రజల ఆనందోత్సాహాలకు కేంద్ర బిందువుగా మారింది. రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ ఆధ్వర్యాన జవహర్‌లాల్ నెహ్రూ రోడ్డును అనుకుని ఉన్న పరమహంస యోగానంద మార్గ్‌లోని హ్యాపీ స్ట్రీట్‌లో ప్రతి ఆదివారం వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. సంక్రాంతి పండగ సెలవులు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా వచ్చిన బంధుమిత్రులతో నగర వాసులు హ్యాపీ స్ట్రీట్‌కు చేరుకున్నారు. పండగను పురస్కరించుకుని ఇక్కడ యువత, చిన్నారులు ఆటపాటలతో సందడి చేశారు. హ్యాపీ స్ట్రీట్ స్టేజిపై వారి డ్యాన్సులు అలరించాయి. వాటిని వీక్షిస్తూ సందర్శకులు ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. ఇక్కడ చిన్నారులకు వివిధ రకాల ఆటలతో పాటు చదరంగం, క్యారమ్స్ షటిల్ బ్యాడ్మింటన్ వంటి క్రీడలు కూడా నిర్వహించారు. హ్యాపీ స్ట్రీట్‌లో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్లు యువతను విశేషంగా ఆకట్టుకున్నాయి.

కొండ మీద తీర్థం.. చూద్దాం రారండోయ్..

- కనుమ రోజే సారంగధరేశ్వరుడికి సాక్షాత్కరించిన పరమ శివుడు
- ఆ రోజునే ఏటా ఆలయం వద్ద తీర్థం
- అన్ని ఏర్పాట్లు చేసిన దేవదాయ ధర్మదాయ శాఖ
- మూడు రోజుల పాటు జరగనున్న వేడుకలు



విద్యుత్ కాంతులతో ముస్తాబైన ఆలయం



శ్రీసారంగధరేశ్వరస్వామి

సీటీఆర్‌ఐ(రాజమహేంద్రవరం): పెద్ద పండగ తరువాత వచ్చే కనుమ రోజున రాజమహేంద్రవరంలోని అతి ప్రాచీనమైన గుడి వద్ద తీర్థం జరుగుతుంది. ఆ తీర్థాన్ని కొండమీద తీర్థంగా పిలుస్తారు. స్థానిక 47వ డివిజన్‌లోని సారంగధరేశ్వర స్వామివారి అతీ ప్రాచీనమైన దేవాలయం ఉంది. ఇక్కడ స్థల పురాణం ప్రకారం సాక్షాత్తు పరమ శివుడు ప్రత్యక్షమై భక్తుడుకి వరం వసిగిన ప్రాంతంగా భాసితిల్లుతోంది. భక్తుడికి కాళ్లు, చేతులు ప్రసాధించి భక్తుడి పేరుని తన పేరుగా మార్చుకున్న ప్రాంతంగా ప్రసద్ధికెక్కింది. ఇదే సారంగధరేశ్వరస్వామి ఆలయం. ఇక్కడే మూడు రోజుల పాటు తీర్థం నిర్వహిస్తారు.

కనుమ రోజే సాక్షాత్కారించిన పరమశివుడు

స్థల పురాణం ప్రకారం రాజమహేంద్రిని రాజధానిగా చుసుకొని రాజరాజనరేంద్రుడు వేంగి దేశాన్ని పాలించేవాడు. అతనికి సారంగధరుడు అనే కుమారుడు ఉన్నాడు. రాజరాజ నరేంద్రునికి రెండు భార్య చిత్రాంగి. ఈమె వల్ల సారంగధరేశ్వరుడి రెండు కాళ్లు, చేతులు తొలగించాలని రాజు ఆజ్ఞాపిస్తాడు. రాజమహేంద్రి కొండమీద సారంగధరేశ్వరుడు కాళ్లు, చేతులు తొలగిస్తారు. దీనితో ఆర్తితో పరమశివుడుని ప్రార్థించగా శివుడు ప్రత్యక్షమై సారంగధరేశ్వరుడికి కాళ్లు చేతులు పునఃప్రసాధించారు. దీంతో పరమశివుడుకి సారంగధరేశ్వరుడు అనే పేరు కూడా వచ్చింది. ఇదంతా కనుమ రోజు కావడంతో ఇక్కడి ప్రజలు కనుమ రోజు స్వామి వారికి పూజలు చేసి కొండమీద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తారు. ఈ సందర్భంగా ఇక్కడ నుంచి కిలో మీటరు దూరం వరకూ రకరకాల స్టాల్స్ ఏర్పాటు చేస్తారు. రంగుల రాట్నాలు, జీడులు, కర్జూరం, బొమ్మల వంటి వాటిని విక్రయిస్తారు. కనుమ రోజు ఈ సందడి మరింత ఆహ్లాదకరంగా ఉండేటట్లు దేవదాయ ధర్మదాయ శాఖ వారు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇక్కడికి చేరుకోవడానికి ఆటోలు, బస్సుల సౌకర్యం విరివిగా ఉంది.

భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశాం



కనుమ రోజు స్వామివారి దర్శనానికి భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఎన్నో సంవత్సరాలుగా ఇక్కడ కొండమీద తీర్థం చాలా ఘనంగా జరుగుతోంది. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం.

– ఎస్. నాగేశ్వరరావు, ఆలయ నిర్వాహణాధికారి